తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

గురువారం

1 అక్టోబర్ 2026

పేజీలు : 08

Follow :






## వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ

# పంటలు సాగు చేయాలి

- కిసాన్ మేళాలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పంట మార్పిడితోనే నీటి పొదుపు.. రైతులకు లాభం
- ఉద్యాన పంటలపై దృష్టి పెట్టండి
- కిసాన్ మేళాలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సూచించారు. పంట మార్పిడితో నీటి వనరులను ఆదా చేయడంతో పాటు భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఉద్యాన, మిల్లెట్ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డితో కలిసి కోదండరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, జీవ పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడమే కిసాన్ మేళా ఉద్దేశమన్నారు. గ్రీన్ ఎరువు విత్తనాలు, ఫెర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్, రైతు భరోసా, రైతు బీమా, సాయిల్ హెల్త్ కార్డుల ప్రయోజనాలను రైతులు పొందాలని సూచించారు.

**ఆధునిక సాంకేతికతతో ముందడుగు..**

అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్ విజయేందర్ రెడ్డిలు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సాగులో ఉత్పాదకత పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**వాతావరణానికి తగ్గ పంటలే మేలు..**

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు వచ్చే మిల్లెట్లు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే సాగు వ్యయం తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా, సాయిల్ హెల్త్ కార్డులు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాళ్లను కోదండరెడ్డి, అధికారులు సందర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు జాం రవి, శ్రీదేవి, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ మన్నెరాజు, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుమోహన్, కేవీకే శాస్త్రవేత్త కృష్ణ, ప్రకృతి వ్యవసాయ రైతు ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో

# రేణు శ్రీకి స్వర్ణం




**మల్కాజిగిరి సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** నాంపల్లి రెడ్‌హిల్స్ జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన 70వ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మల్కాజిగిరి విద్యార్థిని రేణు శ్రీ ప్రతిభ చాటింది. అండర్-17 విభాగంలో బరిలోకి దిగిన ఆమె, ప్రత్యర్థులపై తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. నేరేడ్‌మెట్ వినాయక్ నగర్ బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ చంద్ర శేఖర్ కుమార్తె రేణుశ్రీ, మూడో గుళ్ల సమీపంలోని రాజధాని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచే కిక్ బాక్సింగ్‌పై ఉన్న మక్కువతో పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర స్థాయిలో పసిడి పతకం సాధించినట్లు తండ్రి చంద్ర శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావడమే ఆమె లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన రేణు శ్రీని పాఠశాల యాజమాన్యం, స్థానికులు అభినందించారు.




# హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలలో ఎస్ఎఫ్ఐ విజయం

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఎన్నికలలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) విభాగం విజయం సాధించింది. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో దిల్షాద రెహాన్ విజయం సాధించగా ఉపాధ్యక్షునిగా టీఎస్ఎఫ్ కు చెందిన కొర్ర నితిన్ చౌహాన్, జనరల్ సెక్రెటరీగా ఏ ఎస్ ఏ కు చెందిన ప్రతీక్ విజయం సాధించడం జరిగింది. యూనివర్సిటీలో 79 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇందులో ప్రధాన పోటీ ఏబివిపి, వామపక్ష సారూప్యత కలిగిన ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, డి.ఎస్.యు, ఏఐఎస్ఎఫ్, టిఎస్ఎఫ్ కూటమి మధ్య జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా విజేతలు ఎవరైనా యూనివర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల హక్కుల పరిరక్షణకై ఉద్యమించాల్సిన అవసరం ఉందని, పనికిమాలిన రాజకీయాలకు తావు లేకుండా విద్యాభివృద్ధి ఫలాలను ప్రతి విద్యార్థికి అందేలా చూడాల్సిన బాధ్యత గెలిచిన యూనియన్ నాయకత్వంపై ఉందని విశ్వవిద్యాలయం విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు.

## పోలీసులకు మౌలిక వసతులతో కూడిన

# భవనాలు నిర్మించండి

- పోలీస్ స్టేషన్లకు అణువుగా ఉండే భద్రత ఏర్పాట్లు చేయండి
- తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీ జీ మహేష్ భగవత్

**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్ బుధవారం పర్యటించారు.తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, ఈరోజు వికారాబాద్ జిల్లాలో పర్యటించి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, డీజీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్, కొడంగల్ పోలీస్ స్టేషన్, కొడంగల్ సీఐ కార్యాలయం దుద్యాల పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణ పనులను పరిశీలించి, కొనసాగుతున్న నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆయా పోలీస్ స్టేషన్లు సీఐ కార్యాలయంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు, గదుల ఏర్పాటు, సిబ్బందికి కల్పిస్తున్న మౌలిక వసతులు, కార్యాలయ విభాగాలు ఇతర సౌకర్యాలతో పాటు వివిధ అంశాలను ఆయన పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ డీజీ పోలీస్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులతో పాటు మెరుగైన పని వాతావరణం కల్పించే విధంగా భవనాలను



రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గదుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేయాలని, అవసరమైన చోట అదనపు సౌకర్యాలు కల్పించాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేసి, నిర్ణీత సమయంలో భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కూడా ఆయన ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యత, పనుల పర్యవేక్షణ, విద్యుత్ నీటి సరఫరా, పారిశుధ్యం, సిబ్బంది వినియోగానికి లోపలి పేజీలో

# కబ్జాదారుల చెర నుంచి 7,200 గజాలు రక్షణ

- పార్కు, మార్కెట్ స్థలాలపై ఆక్రమణలు తొలగించిన హైడ్రా
- ప్రీకాస్ట్ గోడలు తొలగింపు.. పెన్సింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం కుందన్‌పల్లి పరిధిలోని టీపీఎస్ చాముండిపట్నం కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన 7,200 గజాల స్థలాన్ని హైడ్రా అధికారులు ఆక్రమణల నుంచి రక్షించారు. పార్కు, మార్కెట్ కోసం కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించి ప్రీకాస్ట్ గోడలు నిర్మించుకున్నట్లు గుర్తించి చర్యలు చేపట్టారు. 1983లో కాలనీ లేఅవుట్ సమయంలో పార్కు కోసం 6 వేల గజాలు, రెండు ప్రాంతాల్లో మార్కెట్ల కోసం 600 గజాల చొప్పున మొత్తం 1,200 గజాలు కేటాయించారు. అయితే ఆయా స్థలాలను అభివృద్ధి చేయకపోవడంతో, కొందరు వాటిని ఆక్రమించి ప్రీకాస్ట్ గోడలు నిర్మించి తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. పార్కు, మార్కెట్ స్థలాలను ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు జరిగినట్లు తేలింది. అంతేకాకుండా పార్కు స్థలంలో గణేశ్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా అనుమతించలేదని కాలనీ వాసులు తెలిపారు. దీంతో చాముండిపట్నం కాలనీ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

**లేఅవుట్ ఆధారంగా విచారణ..**

ఫిర్యాదుపై హైడ్రా అధికారులు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. లేఅవుట్ రికార్డులను పరిశీలించి 6 వేల గజాలు పార్కు, రెండు చోట్ల 600 గజాల చొప్పున మార్కెట్ల కోసం కేటాయించినట్లు నిర్ధారించారు. ఆయా స్థలాలు ఆక్రమణకు గురైనట్లు తేలడంతో అధికారులు చర్యలు చేపట్టారు.

**ఆక్రమణలు తొలగింపు..**

స్థలంలో నిర్మించిన ప్రీకాస్ట్ గోడలను తొలగించి, చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కు స్థలంగా సూచిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడిన హైడ్రా చర్యలపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# హెరిటేజ్ శాఖతో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ

**కళాశాల అవగాహన ఒప్పందం**



**హయత్ నగర్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ, పురావస్తు పరిశోధన, వారసత్వ విద్యను ప్రోత్సహించే దిశగా రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం, తెలంగాణ ప్రభుత్వ హెరిటేజ్ శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తెలంగాణలోని చారిత్రక, పురావస్తు, వారసత్వ, పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వాటి పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని కళాశాల వర్గాలు తెలిపాయి. తెలంగాణ ప్రభుత్వ హెరిటేజ్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగానికి చెందిన డా. నోముల వెంకటేశ్వర్లు, హెరిటేజ్ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి పాల్గొన్నారు. ఎంఓయులో భాగంగా కళ, పురావస్తు శాస్త్రం, వాస్తుశిల్పం, వాణిజ్య మార్గాలు, తెలంగాణలోని వారసత్వ ప్రదేశాలపై విద్యార్థులతో స్వల్పకాలిక పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పురావస్తు ప్రాజెక్టులు, సెమినార్లు, సదస్సులు, తవ్వకాలు, పరిరక్షణ పద్ధతులు, వారసత్వ పరిశోధనల డాక్యుమెంటేషన్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. అలాగే పురావస్తు తవ్వకాల ప్రాజెక్టుల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సహకారం, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సదస్సులు, ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలకు హెరిటేజ్ శాఖ సహకారం అందించనుంది. ప్రతి సెమిస్టర్‌లో ఒకసారి మ్యూజియంలను సందర్శించే అవకాశం కూడా కల్పించనున్నారు. వారసత్వ భవనాల గుర్తింపు, పరిరక్షణ, సంరక్షణకు అవసరమైన సూచనలు అందించనున్నారు. ఈ అవగాహన ఒప్పందం సంతకం చేసిన తేదీ నుంచి ఐదు సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి. సురేష్ బాబు, చరిత్ర విభాగ అధ్యాపకులు డా. ఎస్. గంగాధర్, ప్రొఫెసర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు పురావస్తు శాస్త్రం, వారసత్వ పరిరక్షణ, పరిశోధన, పర్యాటక రంగాల్లో ప్రత్యక్ష అనుభవం లభించడంతో పాటు, తరగతి గది విద్యను తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వనరులతో అనుసంధానం చేసే అవకాశం కలుగుతుందని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

# సీజనల్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండండి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

**ఊపిరితిత్తుల వైద్యులు వై. సాయిరెడ్డి**



**తాండూరు సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా ఫ్లూ (ఇన్ఫ్లుయెంజా) పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని యశోదా ఆసుపత్రి, సికింద్రాబాద్ వైద్యులు డా. వై. సాయిరెడ్డి హెచ్చరించారు. బుధవారం తాండూరు పట్టణంలోని హంస గార్డెన్స్ లో యశోదా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లూ అంటే ఏమిటి?లి ఫ్లూ అనేది ఇన్ఫ్లుయెంజా వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధి. ఇది దగ్గు, తుమ్ముల ద్వారా వేగంగా వ్యాపిస్తుంది. ఏడాదిలో ఎప్పుడైనా రావచ్చు కానీ సాధారణంగా శీతాకాలం, వర్షాకాలంలో ఎక్కువగా వస్తుంది. దీనిని కాలానుగుణ ఫ్లూ అని కూడా అంటారు. ఇది ఆర్.ఎస్.వి వైరస్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కు కారణమవుతుంది. సాధారణంగా 0.1శాతం మరణ రేటు ఉన్నప్పటికీ, 65 ఏళ్ళ పైబడిన పెద్దలు, 5 ఏళ్ల లోపు పిల్లలు, గర్భిణీలు, ఆస్తమా, గుండె జబ్బులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరమని ఆయన తెలిపారు.ప్రధాన లక్షణాలు ఫ్లూ మొదట్లో సాధారణ జలుబులా అనిపించినా, చాలా వేగంగా తీవ్రమవుతుంది. వైరస్ సోకిన 1 నుండి 3 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి.

**38సెం (100.4ఫిఎఫ్) పైన ఆకస్మిక జ్వరం**

గొంతు నొప్పి, పొడి దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కు కారడం.తలనొప్పి, తీవ్ర అలసట, ఆకలి తగ్గడం, వికారం వంటివి ప్రధాన లక్షణాలని వివరించారు.కారణాలు మరియు వ్యాప్తి. ఇన్ఫ్లుయెంజా వైరస్ లో ఎ ,బి ,సి అనే మూడు రకాలు ఉంటాయి. ఎ, బి రకాలు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కలిగిస్తాయి. వైరస్ సోకిన వ్యక్తి దగ్గినా, తుమ్మినా, మాట్లాడినా గాలిలోకి వచ్చే తుంపర్ల ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత ఉపరితలాలను తాకడం వల్ల కూడా వస్తుంది. లక్షణాలు రాకముందు 2 రోజుల నుండే వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుందని, ఈ వైరస్ తరచూ మ్యూటేషన్ చెందుతుందని తెలిపారు. నిర్ధారణ మరియు చికిత్స జాగ్రత్తలు...ఫ్లూ లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కువ నీరు త్రాగాలి. వెంటనే వైద్యులను సంప్రదించి పిసిఆర్ , ర్యాపిడ్ యాంటిజెన్ టెస్ట్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు యాంటీ వైరల్, జ్వరం తగ్గే మందులు వాడాలి. తాండూరులో పాలిష్ యూనిట్లు, సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల గాలి కాలుష్యం ఎక్కువ, దీంతో ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే మూడు నెలల పాటు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. చేతులు శుభ్రం చేసుకోవాలి, మాస్క్ ధరించాలి, తాగే నీరు, తినే తిండి కలుషితం కాకుండా చూసుకోవాలి. సంవత్సరానికి ఒక్కసారి హెల్త్ చెకప్, ఫ్లూ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. ఆలస్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందని డా. సాయిరెడ్డి సూచించారు.

# పోలీసులకు మౌలిక వసతులతో కూడిన భవనాలు నిర్మించండి

అనువైన గదులు ఇతర అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లు సౌకర్యవంతంగా భద్రంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు మెరుగుదలలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐలు శ్రీ వెంకట రమణ, శ్రీశైలం, వేణుకుమార్ సత్యనారాయణ, ఆర్ఎస్ఐలు శివ సిద్ధిఖ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు వైబీ శ్రీనివాస్ రావు, ఈ ఈ బాలాజీ దాస్, డి ఈ ఈ నవీన్ కుమార్, ఏ ఈ ఇతరులు కూడా పాల్గొన్నారు.

# సరస్వతి విద్యాపీఠానికి 20 గుంటల భూమి విరాళం

**రూ.4 కోట్ల విలువైన భూమిని అందజేసిన బండారి శైలజాఆగి రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి**



**చేవెళ్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** చేవెళ్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4లో ఉన్న 20 గుంటల భూమిని శ్రీ సరస్వతి విద్యాపీఠం సంస్థకు చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి (చెన్నారెడ్డి) విరాళంగా అందజేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని తెలిపారు. 20 గుంటల భూమిని 10 గుంటల చొప్పున రెండు భాగాలుగా విభజించి, చేవెళ్ల తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలో శ్రీ సరస్వతి విద్యాపీఠం సంస్థ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. విద్యాభివృద్ధితో పాటు విద్యార్థులకు సంస్కారవంతమైన విద్యను అందించే లక్ష్యంతో పనిచేస్తున్న సరస్వతి విద్యాపీఠానికి భూమిని అందజేయడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం తెలంగాణ ప్రాంత కార్యదర్శి వెంకటలక్ష్మి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి రవీంద్ర శర్మ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్‌రెడ్డి, పూర్వ ఆచార్యులు గోపాల్‌రెడ్డి, నారాయణ, శివరాజు, భోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మేళాలో ఆకట్టుకున్న మినియేచర్ ఆవు

**పశుసంవర్ధక శాఖ స్టాల్‌లో అధిక దిగుబడి విత్తనాలు, మేలు జాతుల ప్రదర్శన**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్ కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళాలో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో వివిధ రకాల పశుసంవర్ధక ఉత్పత్తులు, పశుగ్రాస విత్తనాలు, మేలు జాతులను ప్రదర్శించారు. ముఖ్యంగా రెండు అడుగుల ఆరు అంగుళాల ఎత్తు ఉన్న మినియేచర్ ఆవు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. స్టాల్‌లో అధిక దిగుబడినిచ్చే పశుగ్రాస విత్తనాలు, అధిక పాల దిగుబడినిచ్చే ఆవుల జాతులు, అధిక మాంసోత్పత్తినిచ్చే గొర్రెల జాతులు, మేలు జాతి కోళ్లు, బహువార్షిక పశుగ్రాసాలు, చొప్ప కత్తిరించే యంత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు, టీజీవో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డా. కురుమూర్తి, టీవీఏవో మాజీ కార్యదర్శి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ప్రవీణ్ గౌడ్, డా. నాగరాజు యాదవ్, డా. బలిరాం, డా. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# చిలుకానగర్ డివిజన్‌లో ఘనంగా హరితహారం



**ఉప్పల్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ముస్లిం కబరస్థాన్, గ్రేవ్‌యార్డ్‌లో అధ్యక్షులు షేక్ అభు ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై మొక్కలు నాటారు. అనంతరం కబరస్తాన్ అధ్యక్షులు షేక్ అభు, ప్రధాన కార్యదర్శి ఎండీ మోహమ్మద్ బాబా సమీర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించారు. కబరస్తాన్ అభివృద్ధికి సంబంధించి ఫ్లోరింగ్, డ్రైనేజీ పనులతో పాటు ఈద్గా వద్ద 9 అడుగుల జాలి ఏర్పాటు చేయడం, రెండు గదుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మైనారిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మహేశ్వరం,సెప్టెంబర్ 30(జనంసాక్షి):మహేశ్వరం నియోజకవర్గం ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం నూతన కమిటీని బుధవారం ఒగ్గు బీర్ల కళాకారులు ఎన్నుకున్నారు.ఒగ్గు బీర్ల సంఘం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడిగా జెనిగే కొండల్,ఉపాధ్యక్షుడిగా ఊదరి పాండు,గౌరవ అధ్యక్షులుగా దయ్యాల మల్లయ్య,జెనిగే శేఖర్, దయ్యాల తిరుపతి,ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారులుగా గొరిగే మల్లేష్, ఊదరి శంకర్ ను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ఒగ్గు బీర్ల కళాకారుల తదితరులు పాల్గొన్నారు.

## కేశీ బ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీలు



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 30 జనం సాక్షి :** ప్రధాని నరేంద్ర మోదీ అంకితభావంతో కూడిన 25 సంవత్సరాల ప్రజాసేవకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజల భాగస్వామ్యంతో సమిష్టిగా నిర్వహింపబడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, బాచుపల్లి లోని కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.. మనం కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశం' ఇతివృత్తంగా, 25 సంవత్సరాల సేవ సమర్పణ', 'అభివృద్ధి చెందిన భారతదేశం' అన్న భావనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించబడ్డాయి. పాఠశాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని అద్భుతమైన చిత్రాలు గీశారు. తాము కలలుగన్న భారతదేశం గురించి ఉపన్యసించారు. బాచుపల్లి భాజపా అధ్యక్షురాలు, మాజీ కార్పోరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కోకన్వీనర్ డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలు సాయి వేదశ్రీ, చిన్మయి, శ్లోక, శనయ, ఆరాధన, అభిషేక్ లకు బహుమతి ప్రదానంతో పాటు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మేడ్చల్(అర్బన్) జిల్లా భాజపా సేవా సంకల్ప్ అభియాన్ తరపున ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్స్) అందించారు. ప్రిన్సిపాల్ కవిత, బీజేపీ నాయకుడు పద్మ ప్రసాద్, పాయల్, భువన, సంధ్య, కోటేశ్వరి, దృశ్యంతిలపాల్గొన్నారు.

## పౌర హక్కులతో పాటు ప్రజలు బాధ్యతలను గుర్తుంచుకోవాలి

**మోమిన్ పేట తహసిల్దార్ మునీరుద్దీన్**



**మోమిన్ పేట సెప్టెంబర్30 (జనం సాక్షి) :** పౌర హక్కులతో పాటు ప్రజలు బాధ్యతలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ప్రతి పౌరుని పై ఉందని మోమిన్ పేట తహసిల్దార్ మునిరుద్దీన్, పేర్కొన్నారు బుధవారం మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కుల తో పాటు అవగాహన కల్పించుకొని గ్రామంలో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఆయన సూచించారు, మోమిన్ పేట ఎస్ఐ భరత్ భూషణ్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్, ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ తుల్జారామ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, గ్రామ ఉప సర్పంచ్ లాల్ మొహమ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటయ్య, మల్లికార్జున దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్, రమేష్ పటేల్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామంలోని యువకులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

# న్యూ భవాని నగర్‌కు రూ.33 లక్షల నిధులు

- సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు.. అర్జున్‌రెడ్డి పోరాటానికి ఫలితం

**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ న్యూ భవాని నగర్ కాలనీ అభివృద్ధికి రూ. 33 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాలనీలో అధ్వానంగా మారిన అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరించేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి ఈ నిధులను కేటాయించారు. మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, స్థానిక కాలనీవాసి అర్జున్‌రెడ్డి నిరంతరంగా చేసిన కృషికి ఇది ఫలితమని స్థానికులు పేర్కొన్నారు. కాలనీలో రహదారుల దుస్థితిపై అర్జున్‌రెడ్డి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కాలనీ అభివృద్ధిపై అర్జున్‌రెడ్డి చూపుతున్న చొరవను గుర్తించిన మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్‌గౌడ్ ప్రత్యేకంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 33 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు చొరవ చూపారు. నిధుల మంజూరుతో కాలనీ రహదారుల సమస్యకు పరిష్కారం లభించనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమస్యలపై నిరంతరం పోరాడుతూ నిధుల సాధనకు కృషి చేసిన అర్జున్‌రెడ్డితో పాటు మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్‌గౌడ్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## చిన్నారుల పోషణకు అంగన్వాడీల సేవలు అభినందనీయం

**అగ్గనూర్‌లో ఘనంగా 'అంగన్ మిలన్' కార్యక్రమం**

**యాలాల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా యాలాల్ మండలం అగ్గనూర్ అంగన్వాడీ కేంద్రంలో 'అంగన్ మిలన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం కోసం అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా అంగన్వాడీ కార్యకర్తలను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, అభివృద్ధి కోసం అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.అంగన్వాడీ సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం పట్ల అంగన్వాడీ టీచర్ గాండ్ల పారిజాత, ఇద్దరు ఆయాలు సంతోషం వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తించి ప్రోత్సహించడం మరింత ఉత్సాహాన్ని కలిగించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశం, బీజేపీ నాయకులు శంకర్ రెడ్డి, భూతాక్షుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రభుత్వంలో రైతులందరికీ న్యాయం జరుగుతుంది




**మోమిన్ పేట సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రభుత్వంలో రైతులందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సహకార సంఘాల బలోపేతానికి రైతుల కృషి చేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు, బుధవారం మోమిన్ పేట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం పిఎసిఎస్ చైర్మన్ ఎన్ నరకం రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంట రుణాలు దీర్ఘ కాలిక రుణాలు, రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో థాంక్యూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉండాలని ఆయన సూచించారు, పిఎసిఎస్ చైర్మన్ నరోత్తం రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా 15 కోట్ల 97 లక్షల స్వల్ప కాలిక రుణాలు 20 కోట్ల కు పైగా దీర్ఘకాలిక రుణాలు అందించి సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తుందని ఆయన అన్నారు, జిల్లాలోని ఆదర్శ సహకార సంఘం గా తీర్చిదిద్దే విధంగా పాలకమండలి సభ్యుల సహకారంతో రైతుల సహకారంతో ముందుకు తీసుకెళ్తానని ఆయన అన్నారు, ఎఫ్ఈఓ జిల్లా ఇంచార్జ్ స్రవంతి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పట్లోళ్ల మల్లారెడ్డి, సీఈఓ శేఖర్ సిబ్బంది, బాలయ్య రవికుమార్ నరసింహులు గౌడ్ పాలక మండల సభ్యులు. రైతులు పాల్గొన్నారు

## శ్రీలంక అంతర్జాతీయ సదస్సుకు ఎంసీఈటీ

**లైబ్రేరియన్ రామకృష్ణ రావు పరిశోధనా పత్రం ఎంపిక**



**హయత్ నగర్ సెప్టెంబర్ 30 జనం సాక్షి :** మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంసీఈటీ) లైబ్రేరియన్ రామకృష్ణ రావు పుల్లేటికుర్తి రూపొందించిన పరిశోధనా పత్రం శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైంది. "విద్యా మరియు పరిశోధనా గ్రంథాలయాల్లో కృత్రిమ మేధస్సుతో స్థిరమైన డిజిటల్ సంరక్షణ - అవకాశాలు, సవాళ్లు, భవిష్యత్ దిశలు" అనే అంశంపై ఆయన రూపొందించిన పరిశోధనా పత్రాన్ని అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించనున్నారు. అక్టోబర్ 1, 2 తేదీల్లో శ్రీలంకలోని బదుల్లా నగరంలో ఉన్న ఉవా వెలస్సా శ్రీలంక విశ్వవిద్యాలయంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో వెబ్ కొలమానాలు, సమాచార కొలమానాలు, శాస్త్రీయ ప్రచురణల కొలమానాలపై 20వ అంతర్జాతీయ సమావేశంతో పాటు 25వ కోల్నెట్ సమావేశం నిర్వహించనున్నారు. శ్రీ రామకృష్ణ రావుకు గ్రంథాలయ, సమాచార శాస్త్ర రంగంలో 33 సంవత్సరాల అనుభవం ఉంది. ప్రస్తుతం తమిళనాడులోని జాయ్ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ, సమాచార శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. గ్రంథాలయ రంగంలో ఆయన అందించిన సేవలకు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన సంస్థగా ప్రథమ స్థానం అవార్డు (2023), జి.జి. శివకుమార్ స్మారక పురస్కారం, జాతీయ ఉత్తమ గ్రంథపాలక పురస్కారం-2025 తదితర అవార్డులు లభించాయి. అలాగే డెల్‌నెట్ ద్వారా 22,323 గ్రంథాలయ రికార్డుల భాగస్వామ్యంలో ఆయన చేసిన సేవలు గుర్తింపు పొందాయి. అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రం ప్రదర్శనకు ఎంపిక కావడం పట్ల ఎంసీఈటీ అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజల రక్షణకు అంకితమైన కృష్ణారెడ్డి పోలీస్ సేవలకు పదవి విరమణ

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** పోలీస్ శాఖలో 41 ఏళ్ల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఐ ఏ. కృష్ణారెడ్డి పదవీ విరమణ చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సుమతి ఆయనకు పదవీ విరమణ సర్టిఫికెట్‌ను అందజేశారు. 1985లో రంగారెడ్డి జిల్లాలో కానిస్టేబుల్‌గా పోలీస్ సేవలో చేరిన కృష్ణారెడ్డి.. సీఐడీ, గ్రేహౌండ్స్, సీబీఐ, ఇంటెలిజెన్స్, పీటీసీ, అంబర్‌పేట్, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తదితర విభాగాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. అంకితభావం, క్రమశిక్షణతో సేవలందించిన ఆయనను అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు, పోలీస్ అసోసియేషన్ అధికారులు, కుటుంబ సభ్యులు రూప, ప్రవీణ్‌రెడ్డి, లక్షిత, విహా, ప్రణిత పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ల సేవలు అభినందనీయం

**బిజెపి మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి.**



**మర్పల్లి సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్యతో పాటు గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని మర్పల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజును పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి నెల రోజులపాటు నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" లో భాగంగా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లను మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు రూపకల్పనలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనదని, అంగన్వాడి కేంద్రాలే మనకు అసలైన బలమని ఆయన అన్నారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన బిడ్డ, బలమైన భారత్ అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సంక్షేమ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య, కే.మహేశ్వరీ, బలరాం గౌడ్, ఆలంపల్లి రమేష్, జంగం జైపాల్, వీరన్న, ప్రవీణ్, సంగమేశ్వర్, విజయ్ కుమార్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## జీడిమెట్ల సర్కిల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ వైద్య శిబిరం,.

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 30 జనం సాక్షి :**కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల సర్కిల్, కుత్బుల్లాపూర్ జోన్, సైబెరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో బుధవారం స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల సర్కిల్ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జి. సుష్మా, యుపి హెచ్సి కుత్బుల్లాపూర్, డాక్టర్ టీవీ జ్యోతి రమణి పీహెచ్సీ కుత్బుల్లాపూర్ పారిశుధ్య కార్మికులకు ఆఫీసు సిబ్బంది కి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు . పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులు, సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి. శంకర్ సింగ్ డిప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్, శివ ప్రకాష్, డిప్యూటీ ఈ ఈ (ఎస్ డబ్ల్యూ ఎం ), కుమారి. సాయి లిఖిత సేన్, ఏఈ ( ఎస్ డబ్ల్యూ ఎం), . జిలానీ పాషా, సానిటరీ సూపర్వైజర్ పారిశుధ్య కార్మికులకు పాల్గొన్నారు.

# కొత్తపల్లి సర్పంచ్ ఇంటిపై రాళ్ల దాడి

- దుండగులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్



**కోట్ పల్లి, సెప్టెంబర్ 30 (జనసాక్షి):** కోట్ పల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ నాగారం హేమలత-శ్రీశైలం దంపతుల నివాసంపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి సుమారు 11 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో సర్పంచ్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.

ఈ ఘటనపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రజాప్రతినిధి ఇంటిపై రాళ్ల దాడికి పాల్పడటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొంటూ, ఘటనకు బాధ్యులైన వారిని పోలీసులు వెంటనే గుర్తించి అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ నాయకత్వంలో వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, కోట్ పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్, తాండూర్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగారం మల్లేశం, కొత్తపల్లి సర్పంచ్ నాగారం శ్రీశైలం తదితరులు గ్రామస్తులతో కలిసి కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

దాడికి పాల్పడిన వ్యక్తులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు, ఘటనకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించాల్సి ఉంది.

## రైతుల సంక్షేమమే ధ్యేయం: యాచారం పిఎసిఎస్ చేర్మెన్ రాజేందర్ రెడ్డి



**యాచారం, సెప్టెంబర్ 30 జనం సాక్షి :**
రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిరంతరం సేవలందిస్తోందని సంఘం చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం యాచారంలోని సంఘ కార్యాలయ ఆవరణలో చైర్మన్ అధ్యక్షతన వార్షిక సర్వసభ్య సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాచారం పిఎసిఎస్ పరిధిలోని 20 రెవెన్యూ గ్రామాలు, 24 అనుబంధ గ్రామాలు, 24 గ్రామ పంచాయతీల్లో ఉన్న 8,221 మంది సభ్యులకు, 19,913 రైతు కుటుంబాలకు విత్తనాలు, ఎరువులు మరియు రుణాలు అందిస్తూ సంఘం ఆదర్శంగా నిలిచిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆడిట్ పూర్తి చేసుకుని సొసైటీ రూ. 28,32,061.18 నికర లాభాన్ని నమోదు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. అలాగే, సంఘానికి సొంత (+o1) భవనం, 100 మెట్రిక్ టన్నుల గోదాము సౌకర్యంతో పాటు రూ. 1.92 కోట్లకు పైగా అంచనా బడ్జెట్‌కు సభ ఏకగ్రీవ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఇప్పటివరకు 1,349 మంది సభ్యులకు రూ. 26.88 కోట్ల స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయగా, 1,180 మంది రైతుల నుండి రూ. 12.56 కోట్ల రుణాలు విజయవంతంగా రెన్యువల్ అయ్యాయని చెప్పారు. పంట రుణాలు పొందిన రైతులు వడ్డీ చెల్లించి సకాలంలో అసలును రెన్యువల్ చేసుకోవాలని, లేనిపక్షంలో సాధారణ వడ్డీ 7 శాతం నుండి 13 శాతానికి పెరుగుతుందని స్పష్టం చేశారు. వాయిదా దాటిన దీర్ఘకాలిక రుణగ్రహీతలు అపరాధ రుసుము పడకుండా బకాయిలు చెల్లించి సంఘాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లీగల్ కవరేజ్, హెచ్‌డిసిసిబి లోన్ పాలసీల అమలు, నూతన బడ్జెట్ తదితర అంశాలకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో పిఐసి ఉపాధ్యక్షులు కారింగు యాదయ్య, మేనేజర్ ఎ. నాగ లక్ష్మి, సొసైటీ సిఈఓ (కార్యదర్శి) యమ్. నాగరాజు, డైరెక్టర్లు బొమ్మిడిక పురుషోత్తంరెడ్డి, కత్తిరెడ్డి మాధవి, కొండా మధుకర్ రెడ్డి, గోలిగే ఐలయ్య, కరంభోతు నరేందర్, పాచ్చ బాషా, మక్కపల్లి స్వరూప, ముద్దెల శశికల, కంబాలపల్లి మల్లారెడ్డి, కొండాపురం కళమ్మ, అంబోజు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్ల పై గోపన్ పల్లి తండా వ్యక్తుల దాడి కేసు నమోదు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** హైడ్రా ఆధ్వర్యంలో నల్లగండ్ల చెరువు పూడికతీత పనులలో పాల్గొన్న పలువురు లారీ డ్రైవర్ల పై గోపన్ పల్లి తండాకు చెందిన పలువురు వ్యక్తులు సెప్టెంబర్ 28 రాత్రి రాళ్లు, మట్టిగడ్డలతో తీవ్రంగా దాడి చేయడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాము ప్రైవేట్ వ్యక్తులను కాదని, ఇసుక నువ్వు మట్టిని తరలించడం లేదని, హైడ్రాకు సంబంధించిన పూడికతీత పనులలో ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకే తాము పనులు చేస్తున్నామని పలువురు లారీ డ్రైవర్ లు దాడులకు పాల్పడిన గోపన్ పల్లి తాండావాసులైన సుమన్ మరియు అతని గ్యాంగ్ కు సభ్యులకు వివరించినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే లారీ డ్రైవర్ల పై పరుష పదజాలంతో దూషణకు దిగి పెద్దపెద్ద రాళ్లు, మట్టిగడ్డలతో తీవ్రంగా దాడి చేయడమే కాకుండా లారీలను కూడా ధ్వంసం చేయడంతో నాలుగు లారీల వెండి సీడ్స్ ధ్వంసం కావడం, ఇతర లారీలు పాక్షికంగా దెబ్బతినడం జరిగిందని, తమకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... వారు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిసింది. అయితే గోపన్ పల్లి తండాకు సంబంధించిన సుమన్ మరియు అతని గ్యాంగ్ లోని వ్యక్తులు చేసిన తీవ్రమైన దాడిలో హిటాచి ఆపరేటర్ సునీల్ కుమార్ మెహతా కు తీవ్ర గాయాలు అయినట్లు విశ్వాసనీయ సమాచారం. దాడిలో భాగంగా సునీల్ కుమార్ మెహతాను కింద పడవేసి ఎక్కడపడితే అక్కడ తన్నడంతోపాటు తొక్కడంతో కంటికి, వీపులో సైతం తీవ్ర గాయాలు అయినట్లు తోటి డ్రైవర్లు తెలపడం జరిగింది.

## అదృష్టమైన వ్యక్తి శవమై

షాబాద్, సెప్టెంబర్ 30(జనం సాక్షి); అదృశ్యమైన వ్యక్తి శవమైన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపిన వివరాల మేరకు ఈ నెల 24న మండల పరిధిలోని రేగడి దోస్ వాడ కు చెందిన చాకలి శ్రీకాంత్ హైతాబాద్ లోని వెల్స్పన్ కంపెనీలో నైట్ డ్యూటీ విధి నిర్వహణకు ఇంటి నుండి బయలుదేరి విధులకు హాజరు కాకుండా అదృష్టమైన విషయంపై షాబాద్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు కాగా, శ్రీకాంత్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చందన వెల్లి సమీపంలోని చెరువులో మృతదేహం కనబడడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించగా చాకలి శ్రీకాంత్ గా గుర్తించి పోస్టుమాస్టర్ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను అనేక కోణాలలో దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



## మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు

**కోట్‌పల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు పలు రకాల వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ వర్కర్లకు రక్త పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు మందులను కూడా పంపిణీ చేశారు. పారిశుద్ధ్య పనుల్లో నిరంతరం సేవలందించే కార్మికులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి హేమంత్, మండల పంచాయతీ అధికారి సురేందర్ రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్. మల్లికార్జున్ నియామకం



**అల్వాల్, సెప్టెంబరు 30 (జనంసాక్షి):** నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ సంస్థ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ (మాస్ కమ్యూనికేషన్స్)గా ఎన్. మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ జాతీయ అధ్యక్షుడు మరియు స్థాపకులు డాక్టర్ మెహతాబ్ రే నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. సమాజం, యువత, పిల్లలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మరియు సాధారణ ప్రజలలో మానవ హక్కులపై చైతన్యం, అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సంక్షేమం మరియు సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎన్. మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సగ్గు వేణుమాధవ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, జితేందర్ సింగ్ రాణా స్టేట్ జనరల్ సెక్రెటరీ, డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు తెలంగాణ స్టేట్ స్పోక్స్ పర్సన్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ, సిహెచ్ రమణారెడ్డి స్టేట్ చైర్మన్ సోషల్ సర్వీసెస్, డాక్టర్ రెడ్యా నాయక్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, భాస్కర్ పటేల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ, శ్రీకాంత్ స్టేట్ కమిటీ మెంబర్ మరియు రాష్ట్ర నాయకులు, మానవ హక్కుల నేతలు సామాజికవేత్తలు ఈ నియామకం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు

## మానసిక ఆరోగ్యంపై అవగాహన

**అల్వాల్, సెప్టెంబరు 30 (జనంసాక్షి):** మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు నిపుణుల సలహా, సహాయం తీసుకునేలా అవగాహన కల్పించేందుకు అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెంకటాపురం-1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపవర్ ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు స్టేట్ కో-ఆర్డినేటర్ ఎన్. సిద్ధార్థ పాల్గొని మాట్లాడారు. మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలకు గురైనప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన సమయంలో నిపుణుల నుంచి వృత్తిపరమైన సహాయం, తగిన మద్దతు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబర్పేట్ 2022 లో జరిగిన హత్య కేసులో నిందితుడికి శిక్ష

**అంబర్పేట్ సెప్టెంబర్ 30 జనం సాక్షి :** అంబర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో పటోళ్ల లక్ష్మణ్ అలియాస్ లచ్చు( 22 ) వృత్తి బాడ్ మాస్టర్ సాయిబాబా దేవాలయం గోల్నాక హైదరాబాద్. బ్యాండ్ పనిలో వచ్చిన కూలీ డబ్బుల గొడవ కారణంగా నిందితుడు తనతో పని చేసే పాండ్రి గణేష్ అని వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేశాడు. కోర్టు తీర్పు ప్రకారం హైదరాబాద్ అదనపు సెషన్ న్యాయమూర్తి కి రాజేష్ కుమార్ నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవనకాల కారాగార శిక్ష మరియు 1000 రూపాయలు జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఒకేసారి అమలవుతాయి అన్నా రు. ఈ విషయాన్నిఅంబర్పేట్ ఇన్స్పెక్టర్ టి .కిరణ్ కుమార్ తెలిపారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం

**కీసర పీఏసీఎస్ మహాజనసభలో అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి**

**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కీసరలోని సంఘ కార్యాలయ ఆవరణలో ఆయన అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థంగా అందించేందుకు కృషి చేస్తామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సంఘం అభివృద్ధికి రైతులు, పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు మాలోత్ ధర్మా, మచ్చాని మల్లేష్, కందాడి పోచిరెడ్డి, కౌకుట్ల చిన్న అంజిరెడ్డి, కామసాని మల్లారెడ్డి, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, సీఈఓ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతులు పాల్గొన్నారు.

## నాగారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ పగ్గాలు పంగ శ్రీహరికి డివిజన్ అధ్యక్షుడిగా నియామకం

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా : శ్రీహరి**

**కీసర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** నాగారం డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పంగ శ్రీహరి నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కావలి చంద్రయ్య బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి పంగ శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ, ఎస్సీ సెల్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.శ్రీహరిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంగ హరిబాబు, యువ నాయకుడు కౌకుంట్ల జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, అనిల్ యాదవ్, చిన్నంరాజ్ సతీష్ గౌడ్, కౌకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, దాసోహం చిన్న (నర్సింగ్ రావు) మామిడ్ల శేఖర్ యాదవ్, కిష్టన్నగారి రవి, పంగ సంతోష్, మణి, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.